
సాక్షి బాపట్ల

శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



ఆలయానికి విరాళం

వినుకొండ: రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన జయవరపు రామచంద్రరావు కుటుంబ సభ్యులు రూ.2,02,216 అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 524.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



బండ్లమ్మ సేవలో న్యాయమూర్తి

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారిని సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందిన జి.సాధుబాబు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

న్యూస్‌రీల్

27న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు కృష్ణనగర్‌లోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ జీఆర్‌జేఆర్ మాధవ శంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ చట్ట ప్రకారం వాటాదారులైన యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఈనెల 27న పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్న నిధి ఆప్ కే నికట్ కార్యక్రమంలో పాల్గొనవల్సిందిగా సూచించారు. గుంటూరు ఎస్వీఎన్ కాలనీలోని ఆర్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల సిటీ సెంటర్, కృష్ణాజిల్లా పరిధిలో పెదఅవుటపల్లిలోని హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని శ్రీచైతన్య స్కూల్, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ వారి దేవస్థాన కల్యాణ మండపం, ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ ఎస్వీ ఫంక్షన్ హాల్, బాపట్ల జిల్లా పరిధిలో రేపల్లె బేతపూడిరోడ్డులోని రామకృష్ణ హైస్కూల్, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రగతి మహిళా జూనియర్ కళాశాలలో ఉదయం 9.30 నుంచి నిర్వహించనున్న కార్యక్రమాల్లో యజమానులు, వాటాదారులు పాల్గొని తమ సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు వీలుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫిర్యాదులతో పాటు సూచనలు అందజేయాలని తెలిపారు.

ఐదు మండలాల్లో వర్షం

కొరిటెపాడు : గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఐదు మండలాల్లో వర్షం కురిసింది. కాకుమాను మండలంలో 33.6 మీ.మీ, పెదనందిపాడు 15.2, పొన్నూరు 10.8, ఫిరంగిపురం 10.2, మేడికొండూరు మండలంలో 5.2 మిల్లీమీటర్లు చొప్పున వర్షం పడింది.


సమగ్ర శిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంవో), సెక్టోరల్, ప్లానింగ్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ పోస్టులను డిప్యూటేషన్‌పై భర్తీ చేసేందుకు అర్హులైన వారు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేయాలని డీఈవో పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతనెల 31 నాటికి 50 ఏళ్ల లోపు వయసు కలిగిన గ్రేడ్–2 హెచ్‌ఎంలు, ఎంఈవోలు, డైట్ అధ్యాపకులు గుంటూరు డీఈవో కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. విద్యార్హతల జిరాక్స్ కాపీలతో పాటు ఇతర ధ్రువపత్రాలపై అధికారితో అటెస్టేషన్ చేయించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సమగ్రశిక్షగుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

బీఎల్‌వోలు విధుల్లో ఉన్నతంగా రాణించాలి

పెదకూరపాడు: బీఎల్‌వోలు తమకు కేటాయించిన విధుల్లో ఉన్నతంగా రాణించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం రాత్రి బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీఎల్‌వోల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. సమావేశానికి రాని బీఎల్‌వోల వేతనాలు నిలిపివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి రామచంద్రరావు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

యార్డులో 21,725 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 19,782 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 21,725 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,200 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,852 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

స్త్రీ నిధి రుణం పే సులభతరం

- ఫైలెట్ ప్రాజెక్టుగా జిల్లా ఎంపిక
- తొలుత ఐదు మండలాల్లో ప్రారంభం
- సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- త్వరలో జిల్లా వ్యాప్తంగా అమలు



పేటీఎం మెషీన్లు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): స్వయం సహాయక సంఘాల గ్రూపుల్లోని సభ్యులు స్త్రీ నిధి బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాల వాయిదాల పద్ధతిలో చెల్లింపునకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. పేటీఎం ద్వారా రుణ వాయిదాలు చెల్లించేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. ఈ విధానాన్ని గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు తాము తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించేందుకు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఈఎంఐ చెల్లించిన మరుక్షణమే సభ్యులు రశీదు పొందవచ్చు.

గతంలో రుణాలు చెల్లింపు ఇలా..

జిల్లాలోని 17 మండలాల్లో 662 గ్రామైఖ్య సంఘాలు, 23,670 గ్రూపులు, 2,41,510 మంది సభ్యులు ఉన్నారు. గ్రూపుల్లోని సభ్యుల జీవనోపాధికి స్త్రీ నిధి బ్యాంక్ రుణాలు అందిస్తోంది. రుణాలను నిర్ణీత కాలవ్యవధిలో నెల నెల వాయిదా ల్లో చెల్లించాల్సి ఉంటుంది. పాత విధానంలో నెల నెల వాయిదాలను గ్రూపు సభ్యులు గ్రామైఖ్య సంఘానికి చెల్లించేవారు. గ్రామ సమైఖ్య ఖాతా నుంచి గ్రామ సంఘం అధ్యక్షురాలు ద్వారా వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్) స్త్రీ నిధి ఖాతాకు జమ చేసేవారు. ఈ విధానంలో సమయం ఎక్కువగా వృథా, అదనపు ఖర్చులు పెరిగేవి, నిర్ణీత సమయంలో చెల్లించక పోతే వడ్డీ భారం పడేది. నూతన విధానంలో పూర్తి పారదర్శకత ఉంటుంది. తాడికొండ, గుంటూరు రూరల్, తుళ్లూరు, ప్రత్తిపాడు, పెదకాకాని మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేస్తున్నారు.

ప్రతి గ్రామైఖ్య సంఘానికి పేటీఎం మెషీన్లు

నూతన విధానంలో స్త్రీ నిధి మహిళా బ్యాంక్ ప్రతి గ్రామైఖ్య సంఘానికి పేటీఎం మెషీన్‌ను అందిస్తుంది. మెషీన్‌ను గ్రామైఖ్య సంఘం నియమించిన వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్) లాగిన్ అయి నిర్వహిస్తోంది. రుణం తీసుకున్న సభ్యులు తమ సంఘం లీడర్‌కు స్త్రీ నిధి రుణ వాయిదా మొత్తం చెల్లిస్తుంది. వీఓఏ స్వయం సహాయక సంఘం సమావేశానికి హాజరై స్త్రీ నిధి రుణాల రికవరీ వివరాలు పేటీఎం మెషీన్‌లో నమోదు చేసి లావాదేవీలు పూర్తి చేయాలి. నగదుగా వసూలు చేసిన స్త్రీ నిధి రుణ మొత్తాలు సంఘ లీడర్ తన పర్సనల్ బ్యాంకు ఖాతా ఉపయోగించి(యూపీఐ, రూపే డెబిట్‌కార్డ్) స్త్రీ నిధికి చెల్లిస్తుంది. నగదు ట్రాన్స్‌ఫర్, సభ్యురాలి రుణ ఖాతా నమోదు వెంటనే పూర్తవుతుంది. వెంటనే రశీదు ఇస్తారు.

పేటీఎం ఉపయోగించే విధానం...

- పేటీఎం మెషీన్‌ను వీఓఏ మొబైల్ నంబర్‌తో లాగిన్ కావాలి.
- పేమెంట్ ఎస్‌హెచ్‌జీ ఐడీ నమోదు చేయాలి.
- నమోదు చేసిన వెంటనే ఆ సంఘంలోని స్త్రీ నిధి రుణాలు తీసుకున్న సభ్యుల పేర్లు డిస్‌ప్లే అవుతాయి. డిస్‌ప్లే అయిన సభ్యులలో ఏ సభ్యురాలి ఈఎంఐ చెల్లించాలో డ్వాక్రా సభ్యురాలి పేరు మీద ఉన్న బటన్ సెలెక్ట్ చేయాలి.
- సభ్యురాలి డిమాండ్ మొత్తం, క్లోజర్ ఔట్ స్టాండింగ్ చూపుతుంది.
- సభ్యురాలు ఎంత ఈఎంఐ చెల్లించాలో ఈ మొత్తాన్ని నమోదు చేయాలి.
- రీ పేమెంట్ ఏవిధంగా చేయాలనేది ఎంపిక చేయాలి. రూపే కార్డు,క్యూ ఆర్ కోడ్(యూపీఐ పేమెంట్) సెలెక్ట్ చేసి చెల్లింపులు చేయాలి.

సులభంగా వాయిదాలు చెల్లించవచ్చు

స్త్రీ నిధి చెల్లింపుల్లో పారదర్శకత కోసం నూతన విధానం తేవడం జరిగింది. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఐదు మండలాల్లో పేటీఎం ద్వారా లావాదేవీలు నిర్వహించాలి. రుణాలు రికవరీలో ఏవిధమైన ఆలస్యం జరగకుండా సులభంగా అమలు చేయడం జరుగుతుంది. ఈ విధానం ద్వారా స్వయం సహాయక సంఘాలు చెల్లించిన రికవరీ నేరుగా వారి అప్పు ఖాతాకు జమ అవుతాయి.

– వై.హరిహరనాథ్, పీడీ, డీఆర్‌డీఏ

డిజిటల్ చెల్లింపులతో సమయం ఆదా



స్త్రీ నిధి రుణాలు చెల్లించేందుకు గతంలో బ్యాంకులకు వెళ్లి పేమెంట్ చేయడం కోసం ఎక్కువ సమయం పట్టేది. స్త్రీ నిధి రుణం చెల్లింపుల్లో డిజిటల్ పద్ధతిలో సేవలు ప్రారంభించడం ద్వారా ఎంతో సమయం ఆదా అవుతుంది. 24/7 సమయం రుణాలు చెల్లించే అవకాశం ఉంది.

– జీ అనూష, వీఓఏ, తాడికొండ మండలం

• రూ.55 లక్షలతో గణనాథుని అలంకరణ



గుంటూరు నగరంలోని కేవీపీ కాలనీ 1/10లో వినాయక చవితి వేడుకలు 21వ డివిజన్ కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రూ.55 లక్షలతో గణనాథుడిని ఘనంగా అలంకరించారు. – నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్)

సమాచార హక్కు చట్టంపై స్వీయ సమీక్ష అవసరం

రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సమాచార హక్కు చట్టం అమలు తీరుపై ప్రభుత్వ శాఖలు స్వీయ సమీక్ష నిర్వహించుకోవాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ శాఖ అధికారులకు సమాచార హక్కు చట్టంపై శుక్రవారం విజయవాడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీఐ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం చర్యలు చేపట్టేందుకు అన్ని ప్రభుత్వశాఖల్లోనూ ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. పౌరులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం తగదన్నారు. అడిగిన సమాచారాన్ని ఇవ్వడానికి వీలుపడని పరిస్థితుల్లో తగిన కారణాలను దరఖాస్తుదారులకు సకాలంలో వివరించాలన్నారు. ఆర్టీఐని సమర్థంగా అమలు చేయడమంటే, సొంత ఇంటిని చక్కదిద్దుకుని తమ పనితీరును మెరుగుపరచుకోవడమని ప్రభుత్వాధికారులు భావించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నెల ప్రతి మూడో శుక్రవారం ఆర్టీఐ డేగా ప్రకటించిందని, అన్ని శాఖలు క్రియాశీలంగా స్పందించి ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. 26 జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ తప్పిన ప్రైవేటు విద్యార్థులకు సాధారణ ఫీజులే..

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి, తప్పి మరలా వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ప్రైవేటుగా హాజరయ్యే విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా సాధారణ ఫీజులనే చెల్లించాలని డీఈఓ పి.శైలజ శుక్రవారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 30వ తేదీలోపు పరీక్ష ఫీజును చెల్లించాలని ఆమె సూచించారు. అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, మూడు సబ్జెక్టుల కంటే తక్కువయితే రూ.110 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అక్టోబర్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు రూ.50, ఆరో తేదీ నుంచి 11 వరకు రూ.200, 12వ తేదీ నుంచి 16 వరకు రూ.500 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ తప్పనిసరి

- గృహ నిర్మాణాల్లో వెనకబాటు తగదు
- పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కొల్లూరులో మహిళల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కొల్లూరు: ప్రజా సమస్యలను పరిష్కరించే విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండటం తప్పనిసరి కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ ఏఈఓ, ఏహెచ్‌ఓల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ఆధార్, బ్యాంక్ ఖాతాల సంఖ్యలు నమోదు విషయంలో తప్పులు దొర్లితే వాటిని పరిష్కరించే విషయంలో ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధార్, బ్యాంక్ ఖాతాల సంఖ్యలు సక్రమంగా నమోదు చేయని ఉద్యోగుల విషయంలో ఉపేక్ష ధోరణి తగదని, సిబ్బంది పనితీరు విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు రకాల సమస్యలపై స్పందనకు 210 అర్జీలు రాగా, 28 పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణం పరిష్కరించాలని, సమస్యను పూర్తిస్థాయి లో పరిష్కరించి ఒకే సమస్యపై అర్జీలు తిరిగి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత శాఖల వారీగా అధికారులపై ఉంటుందన్నారు. గృహ నిర్మాణ శాఖ పనితీరుపై సమీక్ష జరిపిన ఆయన జిల్లాలో కొల్లూరు మండలం అట్టడుగు స్థానంలో ఉండటంపై హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ప్రశ్నించి, అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగు పర్చుకుని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అన్నారు. జిల్లాలో పారిశుద్ధ్య పనుల తీరు మెరుగు పడేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో రక్షిత నీటి ట్యాంక్‌లను శుభ్రం చేసే దగ్గర నుంచి, గ్రామం మొత్తం తొలి విడతగా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. కొల్లూరు మండలంలో అధికంగా భూ సమస్యలు, ఇళ్ల స్థలాల మంజూరుపై అర్జీలు అందాయని వాటిని తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. నివేశన స్థలాల కోసం అర్జీలు సమర్పించిన వారిలో అర్హులకు 90 రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టాలు మంజూరు చేస్తా మని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సీహెచ్.శ్రీధర్, రేపల్లె ఆర్డీఓ జె. పార్థసారథి, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిబాబు, ఆర్‌ఐ బి.శివత్రివేణి, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డుతో మేలు

ఎన్‌యూహెచ్‌ఎం స్టేట్ నోడల్ అధికారి విజయలక్ష్మి



ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డును పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

మంగళగిరి: వైద్య సేవలను ప్రజల వద్దకే తీసుకువెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డుతో పేదలు రూ.5 లక్షల ఆరోగ్య బీమా పొందవచ్చని ఎన్‌యూహెచ్‌ఎం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని గణపతినగర్‌లో ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం ఆయుష్మాన్ భవ హెల్త్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌యూహెచ్‌ఎం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని హెల్త్ మేళాను ప్రారంభించి ఆయుష్మాన్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ హెల్త్ మేళా జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డు ద్వారా 1650 రకాల వ్యాధులకు ఆరోగ్య బీమా పొందవచ్చని చెప్పారు. నగర ప్రజలు ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డులను ఆశ కార్యకర్తల వద్ద ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. ఈ హెల్త్ కార్డు ప్రతి ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో చెల్లుబాటు అవుతుందని చెప్పారు. యూపీహెచ్‌సీలు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్‌గా రూపుదిద్దుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి పి అనూష, సూపర్‌వైజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,700, గరిష్ట ధర రూ.5,700, మోడల్ ధర రూ.4,500 వరకు పలికింది.

లక్ష్య సాధనలో కృషి, పట్టుదల కీలకం

- సివిల్ సర్వీసెస్ ఉద్యోగంతో ఉన్నత హోదా, సామాజిక సేవా భాగ్యం
- వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- ఏఎన్‌యూలో ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ శిక్షణ కోర్సు ప్రారంభం



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, వేదికపై రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ తదితరులు

ఏఎన్‌యూ: లక్ష్య సాధనలో కృషి, పట్టుదల ఎంతో కీలకమని వీసీ ఆచార్య పి రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, విజయవాడ తక్షశిల ఐఏఎస్ అకాడమీలు సంయుక్తంగా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ కోచింగ్ కోర్సును శుక్రవారం వీసీ ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ భారతదేశంలో సివిల్ సర్వీసెస్‌కు ప్రత్యేక స్థానముందన్నారు. సివిల్ సర్వీసెస్‌తో ఉన్నత హోదాతోపాటు సామాజిక సేవలో కీలకపాత్ర పోషించే అవకాశం కలుగుతుందన్నారు. సమాజంలోని ప్రతి మనిషి అవసరాలు తీర్చేందుకు సివిల్ సర్వీస్ దోహదం చేస్తుందన్నారు. ఇతర పోటీ పరీక్షలతో పోల్చితే సివిల్ సర్వీసెస్‌కు మరింత కఠోర శ్రమ, ఏకాగ్రత, అంకితభావం, మానసిక ప్రశాంతత అవసరమన్నారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని, కానీ సివిల్ సర్వీసెస్ సాధిస్తేనే విజయవంతమైన జీవితం అనే అపోహలు ఉండకూడదన్నారు. నేడు అధిక శాతం యువత సెల్ఫ్ డిసిప్లేన్‌కు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, దానితోపాటు కఠోర శ్రమ చేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోగలుగుతున్నారన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఏ పబ్లిక్ పాలసీతో కలిపి నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బీఎస్ఎన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విశ్వవిద్యాలయంతో ఎంవోయూ కుదుర్చుకొని ఐఏఎస్ శిక్షణ కోర్సును అందించటం తమ సంస్థకు దక్కిన అరుదైన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. సివిల్ సర్వీసెస్ సాధనకు దోహదం చేసే డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సును కలిపి ఇంటిగ్రేటెడ్ సివిల్స్ కోచింగ్ ప్రారంభించటం అభినందనీయమన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్హత పూర్తయిన వారు నేరుగా డిగ్రీ చదవడంతోపాటు ఐఏఎస్ శిక్షణ తరగతులకు హాజరయ్యే వెసులుబాటు ఉందన్నారు. ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ మాట్లాడుతూ వర్సిటీలో నిర్వహిస్తోన్న ఐఏఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సు సిలబస్ రూపకల్పన, ఎగ్జామ్ నిర్వహణ వంటివి సివిల్ సర్వీసెస్‌కు ఎంతో అనుసంధానంగా ఉన్నాయన్నారు. ఏఎన్‌యూ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు మట్లాడుతూ యూనివర్సిటీ నుంచి గత ఏడాది వంద మంది విద్యార్థులకు ఉచితంగా ఏడాదిపాటు సివిల్స్ కోచింగ్ ఇచ్చామన్నారు. వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య స్వరూపరాణి, ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఆచార్య ప్రమీలరాణి, ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జీవన్ ప్రదీప్



గుంటూరుమెడికల్ : గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కుసుమ జీవన్‌ప్రదీప్ శుక్రవారం విధుల్లో చేరారు. విశాఖపట్నం ఈఎన్‌టీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అడిషనల్ డీఎంఈగా ప్రమోషన్ ఇచ్చి గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. డాక్టర్ జీవన్ ప్రదీప్ 1977లో విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, 1988లో ఈఎన్‌టీ పీజీ పూర్తి చేశారు. నర్సీపట్నం సమీపంలోని నాతవరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా 1992లో ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. ఆంధ్రా మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1994లో విధుల్లో చేరి 2008లో అసోసియేట్‌గా, 2015లో ప్రొఫెసర్‌గా, తాజాగా అడిషనల్ డీఎంఈగా ప్రమోషన్ పొందారు. గతంలో విశాఖపట్నం ఈఎన్‌టీ హాస్పటల్ సూపరింటెండెంట్‌గా, శ్రీకాకుళం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ (రిమ్స్) సూపరింటెండెంట్‌గా పనిచేశారు. మెట్రిక్యులేషన్‌ను ఆయన గుంటూరులో చదివారు. గుంటూరు వైద్య కళాశాలలో ఈఎన్‌టీ పీజీలో చేరి అనంతరం విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. డాక్టర్ జీవన్‌ప్రదీప్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సీలి ఉమా జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్‌రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అభినందించారు.

బుద్ధం.. శరణం గచ్ఛామి

- బౌద్ధ ధర్మానికి బొర్రా గోవర్ధన్ విస్తృత ప్రచారం
- నేడు గుంటూరులో మహాకవి గుర్రం జాషువా సాహితీ పురస్కారం ప్రదానం



బొర్రా గోవర్ధన్

తెనాలి: తెలుగునాట ప్రసిద్ధి చెందిన బౌద్ధ రచయిత బొర్రా గోవర్ధన్‌కు మహాకవి గుర్రం జాషువా సాహితీ పురస్కారం ప్రదానం చేయనున్నారు. జాషువా కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో గుంటూరులోని కార్ప్స్, ఆర్నాల్డ్ పొలస్ ఆడిటోరియంలో శనివారం ఉదయం 10గంటలకు ఏర్పాటయ్యే మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవంలో ఈ అవార్డు అందజేస్తారు. డాక్టర్ పోలె ముత్యం అధ్యక్షతన జరిగే సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్, రిటైర్డ్ డీజీ ఎస్.బాలస్వామి, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే విద్యాసాగర్, జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, భీమ్ సేనా సేవాదళ్ అధ్యక్షుడు ఎన్.నీలాంబరం పాల్గొంటారు. ప్రజాగాయకుడు పీవీ రమణ సభను నిర్వహిస్తారు.

గొప్ప సృజనకారుడు

గేయ రచయితగా, గాయకుడిగా, సమాజ చైతన్యానికి అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని సాగుతున్న గొప్ప సృజనకారుడు బొర్రా గోవర్ధన్. ఇంకిపోయిన నీరులాగ ఉండిపోయిన బౌద్ధ ధర్మ ఊటను సాహిత్య రూపంలో పైకి రప్పించడానికి తెలుగు నాట కొన్నేళ్లుగా రచయితలు కృషి చేస్తున్నారు. దానిని మరింత విస్తారంగా ప్రజల్లోకి తీసుకెళుతున్న ఘనత గోవర్ధన్‌కు దక్కుతుంది. స్వస్థలం నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం. వ్యవసాయ కూలీ కుటుంబం. హైస్కూలు చదువులో దేశభక్తి గీతాలతో రచన అలవడింది. విప్లవ గ్రూపుతో ఏర్పడిన పరిచయంతో ఇంటర్‌లో చదు వు మానేశారు. పౌరహక్కుల ఉద్యమంలో విప్లవ గీతాలు రాయడం, గానం చేయడం సాగించారు. 1985 తర్వాత విప్లవ రాజకీయాలకు స్వస్తి పలికి, నగరంలో పాఠశాల ప్రారంభించారు. వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, షట్‌దర్శనాలతో సహా ప్రాచీన భారతాన్ని అధ్యయనం చేశారు.

బుద్ధుని బోధనలే ఏకైక పరిష్కారం

కులసమాజ నిర్మూలనకు బుద్ధుని బోధనలే ఏకైక పరిష్కారమని బొర్రా గోవర్ధన్ విశ్వసించారు. బౌద్ధంలోని మానవత్వ పరిమళాలు తననూ ఆ దిశగా నడిపించాయంటారు. అంబేడ్కర్ స్ఫూర్తితో 2005 నుంచి బౌద్ధ రచనలు ఆరంభించారు గోవర్ధన్. బౌద్ధ భిక్షువు శాసన రక్షిత నుంచి బోధలు తీసుకుని, 2006లో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. సంక్లిష్టమైన బౌద్ధ సాహిత్యాన్ని సరళ భాషలో ప్రజలకు చేరువచేయసాగారు. రాహుల్ సాంకృత్యాయన్ 'బౌద్ధ దర్శన్'ను 'బౌద్ధ దర్శనం'గా తెలుగులోకి అనువదించారు. హిందీలోంచి తెలుగులోకి అనువదించిన మరో పుస్తకం 'భగవాన్ బుద్ధ'కు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ అనువాద గ్రంథ పురస్కారం అందజేసింది. వివిధ అంశాలపై 101 పుస్తకాలు రాస్తే, అందులో 35 వరకు బౌద్ధ సాహిత్యమే. మహాకవి జాషువాపై రచించిన 'నా కథ' ప్రసిద్ధి చెందినది. వీరి బౌద్ధ రచనలకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్‌ను బహూకరించింది.

క్లుప్తంగా

గణేష్ లడ్డూ రూ.1,03,000



నరసరావుపేట రూరల్: మండలంలోని పెదరెడ్డిపాలెంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో శుక్రవారం లడ్డూ వేలం నిర్వహించారు. 13 కేజీల లడ్డూను రూ.1,03,000లకు గ్రామానికి చెందిన పోతిరెడ్డి సాయికుమార్‌రెడ్డి దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. డీజేతో యువకులు డాన్స్‌లు చేస్తూ ఊరేగింపులో సందడి చేశారు.

దేచవరం విఘ్నేశ్వరుని లడ్డూ రూ.96.116



నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో వినాయక నిమజ్జన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కొండా వారి వీధిలో ఏర్పాటు చేసిన మండపంలోని విఘ్నేశ్వర ప్రతిమ వద్ద 41 కేజీల లడ్డూ ప్రసాదాన్ని ఉంచి విశేష పూజలు చేశారు. వేడుకల సందర్భంగా వినాయకుడి ప్రతిమ వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొండా మిథున్ రెడ్డి రూ. 96,116లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పుష్పగిరి పీఠం భూముల సమస్యకు పరిష్కారం

- పీఠాధిపతి, రైతుల మధ్య ఒప్పందం
- హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గోపిరెడ్డి సమక్షంలో మార్చుకున్న పత్రాలు



హైదరాబాద్‌లో రైతులకు పత్రం అందజేస్తున్న పీఠాధిపతి శ్రీశ్రీ అభినవదండ విద్యాశంకర భారతీస్వామి, చిత్రంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: మండలంలోని లింగంగుంట్ల పుష్పగిరి పీఠాధిపతుల అగ్రహారం భూముల సమస్యకు కొంత పరిష్కారం లభించింది. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చొరవ, మాజీ డీజీపీ అరవిందరావు సహకారంతో రైతుల ఆధీనంలో ఉన్న అగ్రహారం భూములపై కొన్ని నిబంధనలతో పీఠాధిపతి శ్రీశ్రీ అభినవదండ విద్యాశంకర భారతీస్వామికి, రైతుల మధ్య ఒక అంగీకారం కుదిరింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో ఇద్దరి మధ్య కుదిరిన ఒప్పంద పత్రాన్ని పీఠాధిపతి గ్రామ పెద్దలకు అందజేశారు. ప్రాథమిక సమాచారం మేరకు వ్యవసాయ భూములకు 13శాతం, రోడ్ల వెంటనున్న భూములకు 18 శాతం, భవిష్యత్‌లో వాణిజ్య పరంగా ఉపయోగపడే భూములకు 20శాతం మార్కెట్ విలువ పీఠానికి చెల్లించే విధంగా ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. కొన్ని దశాబ్దాలుగా లింగంగుంట్లలోని పుష్పగిరి పీఠానికి చెందిన సుమారు 1470 ఎకరాల భూమి రైతుల ఆధీనంలో ఉంది. వారే పంటలు పండించుకుంటూ అవసరాలకు విక్రయించుకున్నారు.

అయితే తమ భూములు తమకు సొంతం చేయాలని పీఠాధిపతులు కోర్టును ఆశ్రయించగా ఆ భూములపై హక్కులు పీఠానికే చెందుతాయని కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో క్రయవిక్రయాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. సమస్య పరిష్కారానికి పీఠాధిపతులతో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గత కొన్నేళ్లుగా రైతులు మంతనాలు చేస్తూ వస్తున్నారు.

ఇటీవల ఎమ్మెల్యే గోపిరెడ్డి, కలెక్టర్ శివశంకర్ ఉన్నతాధికారులతో చర్చించి పలుమార్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పీఠానికి చెందిన పెద్దలతో మాట్లాడి ఎన్నో ఏళ్లగా ఉన్న సమస్యను కొలిక్కి తీసుకొచ్చారు. ఇరువర్గాలు కోర్టు, ప్రభుత్వ అంగీకారంతో నిబంధనల మేరకు నడుచుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కామిరెడ్డి నాగిరెడ్డి, ఏరువ మోహనరెడ్డి, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

25 నుంచి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్

బాపట్ల: పేదలకు సాగుభూమి, ఉపాధి, సామాజిక న్యాయం దక్కేంత వరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు చేస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తెలిపారు. బాపట్ల పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆయనతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ 22వ రాష్ట్ర మహాసభల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు బాపట్ల పట్టణంలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సంఘం ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.వెంకట్రావు, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్.రామకృష్ణ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు జేబీ శ్రీధర్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సంఘ జిల్లా అధ్యక్షులు అద్దంకి నాగేశ్వరావు పాల్గొన్నారు.

జాషువా పద్యం ప్రతి హృదయాన్ని స్పృశించింది



రామబ్రహ్మంను సత్కరిస్తున్న మాణిక్యవరప్రసాద్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్

పాత గుంటూరు: తెలుగు వారి గౌరవాన్ని కాపాడేది పద్యమేనని, ఆ పద్యాలలో జాషువా పద్యం అందరి హృదయాలను తాకిందనీ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మహాకవి జాషువా కళా పీఠం ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి వారోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై జాషువా పద్యానికి పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. సభకు కళాపీఠం వ్యవస్థాపకులు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మం, మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మన్నం రాయుడు, తానా పూర్వ అధ్యక్షులు తోటకూర ప్రసాద్, ప్రముఖ పాత్రికేయులు మాశర్మ పాల్గొన్నారు. అనంతరం రామబ్రహ్మంకు దళిత బంధు పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం ఉపాధ్యక్షుడు గద్దం ఎలీషా, సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం జాషువా కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో సంతోష్ నగర్‌లోని కార్ల్స్ ఆర్నాల్డ్ పౌలస్ ఆడిటోరియంలో సభ నిర్వహించనున్నట్లు డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు.

సురక్షిత జలంపై అవగాహన పెంచుకోవాలి

గుంటూరు రీజనల్ లేబొరేటరీ సీఎస్‌టీ డాక్టర్ జి.శోభారాణి



లేబొరేటరీని పరిశీలిస్తున్న డాక్టర్ శోభారాణి

నరసరావుపేట: సురక్షితమైన జలంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని గుంటూరు రీజినల్ లేబొరేటరీ సివిల్ సర్జన్, బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ జి.శోభారాణి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలోని జిల్లా నీటి నాణ్యత పర్యవేక్షక ప్రయోగశాల సందర్శించారు. ఆమె మాట్లాడుతూ తాగేందుకు నీటిని ఉపయోగించుకునే విధానంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హానికరమైన సూక్ష్మజీవులు, రసాయన పదార్థాలు, అధికంగా లవణాలు, సేంద్రియ పదార్థాలు లేకుండా తగినంత ఆక్సిజన్ కలిగిన నీరే సురక్షితమైన జలమని వివరించారు. నీటి పరీక్షల కొరకు లేబొరేటరీ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబొరేటరీ డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారిగా నియమితులైన గుంటూరు సీనియర్ వాటర్ అనలిస్ట్ వినుకొండ రాజారావును సిబ్బందికి పరిచయం చేశారు. కార్యాలయపు సిబ్బంది జె.శ్యాం బాబు, ఎస్.భాస్కరరావు, వి.శివకుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల క్లెయిమ్స్‌ను త్వరగా పరిష్కరించాలి

గుంటూరు వెస్ట్: పరిశ్రమలకు సంబంధించి ప్రోత్సాహక రాయితీల క్లయిమ్స్‌ను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాయితీ క్లెయిమ్స్ పెండింగ్ ఉంచుకోవద్దన్నారు. ఉపాధి కల్పనకు పరిశ్రమలు ఎంతో దోహదపడతాయన్నారు. మహిళలు, యువత పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు అధికారులు ప్రోత్సహించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అందించే దరఖాస్తులను సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పరిశీలించి త్వరగా అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. జిల్లాలో డిమాండ్ ఉన్న వస్తువుల తయారీ, దీని కోసం ప్రభుత్వం అందించే రాయితీలను ప్రజలకు వివరించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన 23 క్లెయిమ్స్‌కు 1.92 కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ తీర్మానం ఆమోదించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం.విజయరత్నం, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్ రెడ్డి, ఏపీఐఐసీ డీఎం దీవెన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలను జరుపుకుంటున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 29న గుంటూరు జిల్లాలో నిర్వహిస్తున్న బైక్‌జాతాలో యూటీఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అదే విధంగా అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడలో జరిగే సభకు ఉపాధ్యాయులందరు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పంట కాలువలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

- చిన్నారుల మృతితో పొన్నూరులో విషాదం
- ఆడుకుంటూ వెళ్లి సమీపంలోని పంట కాలువలో పడిన వైనం
- స్నేహ బంధాన్ని వీడని చిన్నారులు




చిన్నారుల మృతదేహాలు

పొన్నూరు: ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటనతో పొన్నూరులోని డీవీసీ కాలనీలో విషాదం నెలకొంది. పట్టణానికి చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు సోగా బుజ్జిబాబు, లక్ష్మీల కుమారుడు ప్రేమ్ చంద్ (7), వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఏసుబాబు, శిరీషల కుమారుడైన మద్దెల మహేంద్ర (5)ల మరణం ఆ ప్రాంతవాసుల్ని కలచివేసింది. కాగా వివరాలు ఇలా ఉన్నాయి.. ఇరువురు చిన్నారులు గురువారం ఇంటి వద్దనే ఆడుకుంటున్నారు. ఒకే ప్రాంతానికి చెందిన ఇరు కుటుంబాలకు చెందిన పిల్లలు కనిపించకపోవడంతో తల్లిదండ్రులతో పాటు కాలనీవాసులూ గాలింపు చేపట్టారు. పట్టణ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

ఓ వ్యక్తి సమాచారంతో మృతదేహాలగుర్తింపు

- చిన్నారులు ఆడుకుంటూ సమీపంలోని శ్రీ రంగపురం పంటకాలువ వైపు వెళ్లారు. గమనించిన స్థానికులు అటు వైపు వెళ్ళవద్దని మందలించారు. అయినా వారి మాటను పట్టించుకోకుండా పంట కాలువ వైపు వెళ్లారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అర్ధరాత్రి వరకు వెతికారు. పంట కాలువలో మృతదేహాలను గమనించిన ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు తల్లిదండ్రులు తమ పిల్లలను గుర్తించారు. పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.
- వైఎస్సార్ సీపీ నాయకులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, అంజుమన్ ప్రెసిడెంట్ మాము, నాయకులు ఎ.సాంబశివరావు, మొహమ్మద్, గేరా సంజీవ్, యాడ్లూరి మస్తాన్, మధుసుదన్ రావు తదితరులు ప్రమాదవశాత్తు మృతి చెందిన చిన్నారుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆదేశాల మేరకు కుటుంబానికి రూ. పదివేలు ఆర్థిక సహాయం అందించారు.

స్నేహ బంధాన్ని వీడలేదు

చిన్నారుల మృతి ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. మరణంలోనూ వారిద్దరు స్నేహ బంధాన్ని వీడలేదు. పంట నీటిలోని పూడులో పిల్లల కాళ్లు కూరుకుపోయి బయటికి రాలేని స్థితిలో ప్రాణాలు విడిచినట్లు కనిపించింది. మరణంలోనూ ఒకరి చేయి ఒకరు పట్టుకొని ఉండడం చూసిన కాలనీవాసులు ఆవేదన చెందారు. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

యూవీ ప్యాడ్స్ పరిశీలన



పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, ఆర్డీఓ ప్రభాకరరెడ్డి

ఫిరంగిపురం: ఎన్నికలకు సంబంధించి ఈవీఎం మిషన్లుకు అనుసంధానం చేసే యూవీ ప్యాడ్లు హర్యానా నుంచి 5,180 వరకు వచ్చినట్లు తహసీల్దార్ పద్మనాభుడు శుక్రవారం తెలిపారు. యూవీ ప్యాడ్లు సరిగా ఉన్నదీ లేనిదీ వాటిలో లోపాలు సరిచేసి మిషన్లు మరలా పనిచేసే విధంగా మండలంలోని రేపూడి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బెల్ కంపెనీ ఇంజినీర్లు వాటిని రిపేర్లు చేస్తున్నట్లు చెప్పారు. వాటిని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్, ఆర్డీవో ప్రభాకరరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం. వెంకట్రామిరెడ్డిలు పరిశీలించారు , ఈవీఎం మిషన్లుకు అనుసంధానం చేసే యూవీప్యాడ్లలో ఉన్న లోపాలు బెల్ కంపెనీ ఇంజనీర్లు సరిచేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. మరో వారం రోజులపాటు వీటి పనితీరు పరిశీలిస్తారని వారు తెలిపారు. వారి వెంట తహసీల్దార్ పద్మనాభుడు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిమజ్జనానికి వెళ్లి అదృశ్యమైన ఆటోడ్రైవర్

తెనాలిరూరల్: వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటన గురువారం అర్ధరాత్రి దాటాక తెనాలిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఉప్పు నాగబాబు (30) వినాయకుడి నిమజ్జనంకు స్నేహితులతో కలసి వెళ్లాడు. వీఎస్సార్ కళాశాల వద్ద తూర్పు కాల్వలో నిమజ్జనం పూర్తయ్యాక మిత్రులతో కలసి కాల్వలోకి దిగిన అతను కనబడకుండాపోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భార్య భవాని త్రీ టౌన్ పోలీసులకు శుక్రవారం ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటితో ముగియనున్న ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థి ఛాతీ కొలుస్తున్న పోలీస్ అధికారి



పరుగు పోటీలో అభ్యర్థులు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్ పర్యవేక్షించారు. తొలుత అభ్యర్థుల ఒరిజినల్, నకల్ల ధ్రువీకరణ పత్రాల్ని పోలీస్ అధికారులు, సిబ్బంది నిశితంగా పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతల్ని నమోదు చేసుకున్నారు. 100, 1,600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించేందుకు అభ్యర్థులు పోటీపడ్డారు. 903 మంది పురుష అభ్యర్థుల్లో 517 మంది ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), చంద్రశేఖర్ (ఏఆర్), నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఐజీ కార్యాలయ సీఐ సుధాకర్, ఆర్ఐలు, విజయశేఖర్ (ఎస్సీ, ఎస్టీ సెల్), సీఐలు, ఎస్ఐలు, మినిస్ట్రీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పీల్ దాఖలు చేసిన అభ్యర్థులుహాజరుకావాలి

దేహ దారుఢ్య పరీక్షలకు సంబంధించి అప్పీల్ దాఖలు చేసిన వారంతా శనివారం 12 గంటలకు హాజరుకావాలని అధికారులు సూచించారు. గత నెల 25న ప్రారంభంకావాల్సిన పరీక్షలు 26న మొదలయ్యాయి. అయితే, వర్షం కారణంగా పలుసార్లు వాయిదా పడ్డాయి. శనివారం వర్షం కురవకపోతే పోటీ పరీక్షలు ముగిసినట్లేనని పోలీస్ వర్గాలు తెలిపాయి.

సర్పానికి చెలగాటం.. పక్షికి ప్రాణ సంకటం



కొంగపిల్లను ఒడిసి పట్టుకున్న పాము



పక్షిని మింగుతూ కిందికి వేలాడుతున్న పాము

కృత్తివెన్ను: క్షుద్బాధ తీర్చుకోవాలన్న ఆతృత ఆ సర్పానిది.. ప్రాణాలు కాపాడుకోవాలన్న తపన పక్షిది. వెరసి ఇరువురి జీవన పోరాటంలో పాముదే పై చేయి అయ్యింది. వేప చెట్టుపై ఓ కొంగ గుడ్లు పెట్టి పిల్లలను పొదిగింది. ఎలా చూసిందో కానీ పాము మెల్లగా చెట్టుపైకి ఎక్కి ఓ కొంగ పిల్లను నోటకరుచుకుంది. ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ కొంగ పిల్ల ఎంత ప్రయత్నించినా పాము బలం ముందు దాని పోరాటం నిలవలేక పోయింది. దాదాపు 40 నిముషాల పాటు కిందికి వేలాడుతూనే ఆ పాము కొంగ పిల్లని పూర్తిగా మింగేసింది. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో శుక్రవారం ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

విద్యుత్ వాహనాలను వాడుదాం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0లో కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా కార్ ఫ్రీ డే జరిగింది. ఈ సందర్భంగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎలక్ట్రిక్ వాహనాలను అందరు ఉపయోగించాలని మున్సిపల్ అధికారులకు, సిబ్బంది సూచించారు. వాయు కాలుష్యానికి కారణమయ్యే కర్బన ఉద్గారాల వినియోగంపై ప్రజలంతా చైతన్యం పెంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడాలని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో విద్యుత్ ద్విచక్ర వాహనాలు ఇచ్చేందుకు స్టేట్ నోడల్ ఏజెన్సీగా ఆంధ్రప్రదేశ్ నూతన పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వ్యవహరిస్తోందన్నారు. ఈ పథకంలో ఏ విధమైన ముందస్తు డబ్బులు కట్టవలసిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకునేందుకు హెచ్‌టీటీపీ//ఈవీఎన్ఆర్ఈడీసీఏపీడాట్‌ఇన్ వెబ్‌సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజ రెడ్డి పాల్గొన్నారు.